క్లుప్తంగా

నేడు ఆర్‌ఎస్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: ఆర్‌ఎస్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు విభాగ్ సహ కార్యవాహ రంగస్వామి శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్ హాజరవుతారని తెలిపారు. కార్యకర్తలు, మండలస్థాయి సేవకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి


అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఘనపురం శ్రీనివాస్(72) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావులు మృతదేహానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. శ్రీనివాస్ గత రెండు పర్యాయాలు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొనసాగారు.

ముగిసిన ఎక్కాహం

కెరమెరి: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమైన ఎక్కాహం శనివారం ముగిసింది. 24 గంటలపాటు భజనలు కొనసాగాయి. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఉయ్యాలలో వేసి పాటలు పాడారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అర్చకుడు బాపూదేవ్ ఆధ్వర్యంలో శివపార్వతులకు, రాధాకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఉట్టిని కట్టారు. ఆచారం ప్రకారం గ్రామ పెద్దలు ఉట్టి పగులగొట్టారు. మహిళలు శివపార్వతులు, కృష్ణ, రాధాలకు పూజలు చేశారు. అనంతరం మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేశారు.

రైతు కష్టం వరద పాలు

- ప్రాణహిత, పెద్దవాగు వరదలతో నీట మునిగిన పొలాలు
- వేల ఎకరాల్లో పంట నష్టం
- పరిహారం అందించాలని రైతుల వేడుకోలు



ఈ మహిళ పేరు ధనుకరి గీత. దహెగాం మండలం రాళ్లగూడ గ్రామం. గ్రామ సమీపంలో నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేయగా భారీ వర్షానికి పెద్దవాగుకు వరద వచ్చి వరద నీరు పత్తి చేనులో పాయగా పారింది. దీంతో రెండు ఎకరాల్లో పత్తి పూర్తిగా కొట్టుకుపోయింది. వ్యవసాయ భూమి కూడా కోతకు గురైంది. ఏటా అప్పులు పెరిగిపోతున్నాయని, సర్కారు ఆదుకోవాలని ఆమె వేడుకుంటుంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు ఎల్కరి సంతోష్. దహెగాం మండలం కర్జి గ్రామానికి చెందిన ఈ రైతు ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. పత్తికి అనుకూలంగా వర్షాలు కురుస్తున్న క్రమంలో పత్తి బాగానే ఉంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురువడంతో పెద్దవాగు, ఎర్రవాగులు ఉప్పొంగి పత్తి పంట మొత్తం నీట మునిగింది. వేల రుపాయల పెట్టుబడి, రెక్కల కష్టం వరద పాలైందని ఆవేదన చెందుతున్నాడు.


దహెగాం: నీట మునిగిన వరి పొలాలు



ఈ రైతు పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ గ్రామానికి చెందిన పాలె సంతోష్. తనకున్న రెండున్నర ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దవాగు ఉగ్రరూపం దాల్చి పంటను ముంచెత్తింది. పెట్టుబడిగా పెట్టిన సుమారు రూ. 50వేలు నీటిపాలయ్యాయని వాపోతున్నాడు.

దహెగాం/పెంచికల్‌పేట్: దేశానికి అన్నం పెట్టే రైతన్న కష్టం వరద పాలైంది. హలాలు పట్టి పొలాలు దున్ని రెక్కల కష్టాన్ని నమ్ముకుని ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలు బాగానే ఉన్నాయని అనుకున్న సమయంలో ఒక్కసారిగా భారీ వర్షాల వల్ల వరదల ఉధృతికి పంటలు నీట మునిగి కొట్టుకుపోయాయి. వేల రూపాయలు ఖర్చు చేసి పంటలకు పెట్టుబడి పెట్టి మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకోగా పెద్దవాగు, ఎర్రవాగులలో భారీగా వరద రావడంతో వాగుల పరీవాహక ప్రాంతాల్లోని పంటలు కొట్టుకుపోయాయి. దీంతో ప్రభుత్వం పంట సర్వే చేసి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

దహెగాంలో..

ఖరీఫ్‌లో దహెగాం మండలవ్యాప్తంగా సుమారు 27వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం పత్తికి అనుకూలంగానే వర్షాలు పడుతున్నాయని, పంట బాగానే ఉందని అనుకున్న క్రమంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురువడంతో పెద్దవాగు, ఎర్రవాగులు ఉప్పొంగి వరద పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. వాగుల పరీవాహక ప్రాంతాలు ఇట్యాల, కోత్మీర్, బీబ్రా, ఐనం, దహెగాం, ఒడ్డుగూడ, అమరగొండ, గెర్రె, గిరవెల్లి, కర్జి గ్రామాల్లో పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగింది. సుమారు 5వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయాధికారులు సర్వే చేస్తుండగా, సర్వే చేసినా పరిహారం వస్తుందా లేదోనని రైతులు అయోమయంలో ఉన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెద్దవాగుకు వరద పోటెత్తడంతో పరీవాహక ప్రాంతాల్లోని పెంచికల్‌పేట్, ఎల్లూర్, అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ గ్రామాల్లో వందల ఎకరాల్లో పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తీవ్రంగా పంట నష్టం జరిగినా అధికార యంత్రాంగం రైతుల వైపు కన్నెత్తి చూడటం లేదు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దవాగు, ఉచ్చమల్లవాగు, బొక్కివాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జూలైలో ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నదికి వరద పోటెత్తింది. దీంతో మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో పంటలు పూర్తిగా వరదకు కొట్టుకుపోయాయి. దీంతో రెండోసారి అన్నదాతలు పత్తి విత్తనాలు నాటారు. ఇప్పుడు ఒకవైపు ప్రాణహిత, మరోవైపు పెద్దవాగులు ఉగ్రరూపం దాల్చడంతో పంటలు నీటి పాలయ్యాయి.


పెంచికల్‌పేట్: గుండెపల్లిలో నీట మునిగి దెబ్బతిన్న పత్తి పంట

అధికారులు రావడం లేదు



భారీ వర్షాలతో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగింది. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు పెద్దవాగు వరదలతో కొట్టుకుపోయాయి. పలుమార్లు అధికారులకు విన్నవించినా నేటికీ పంటలను పరిశీలించలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సర్వే నిర్వహించి పరిహారం అందించాలి.

– మడే మల్లేశ్, గ్రామం. గుండెపల్లి, మం. పెంచికల్‌పేట్

పరిహారం అందించాలి



రెండున్నర ఎకరాల్లో పత్తి పంట వేశాను. పెద్దవాగు సమీపంలో ఉండడంతో భారీ వరదలతో పంట మొత్తం నీటిలో కొట్టుకుపోయింది. కర్జి, గిరవెల్లి, ఈటపల్లి తదితర గ్రామాల్లో పంటలకు సైతం తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వం దయ చూపి పంట సర్వే చేసి పరిహారం అందించాలి.

– అంజన్న, గ్రామం. కర్జి, మం. దహెగాం

'ధర్మపురి'కి సన్మానం


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు -2025 కోసం జాతీయ స్వతంత్ర జ్యూరీకి నిర్వహించిన ముఖాముఖిలో జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మపురి వెంకటేశ్వర్లు ఎన్నిక కాగా శనివారం కేస్లాపూర్ హనుమాన్ ఆలయం ఆవరణలో కమిటీ ప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ పూజారి శిరీష్‌శర్మ, కమిటీ ప్రతినిధులు వివేక్, వెంకన్న, రమేశ్, బాలేశ్వర్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, యాదగిరి, లక్ష్మణ మూర్తి, నారాయణమూర్తి, శ్రీనివాస్, మధు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


దహెగాం: చెక్కులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామానికి చెందిన బొట్లకుంట మహేందర్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.11500 చెక్కు మంజూరు కాగా బీజేపీ నాయకుడు ప్రభాకర్ శనివారం లబ్ధిదారుడికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు లబ్ధిదారుడికి చెక్కు అందచేశామన్నారు.

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు లగ్గామ దామోదర్ ఏడుగురు లబ్ధిదారులకు చెక్కులు అందించారు. సహకార సంఘం వైస్‌చైర్మన్ రాపర్తి ధనుంజయ్ నాయకులు పడాల సురేశ్, మల్లేష్, శంకర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి


వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: మండల కేంద్రంలో శనివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గోలెం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి మల్లేష్, మండల కోశాధికారి మండల మధూకర్, కార్యదర్శి వెంకన్న, నాయకులు నవీన్‌గౌడ్, కనకయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి


మొక్క నాటి నీళ్లు పోస్తున్న విజయ భాస్కర్ రెడ్డి

రెబ్బెన: మొక్కలు నాటి వదిలేయకుండా భావి తరాలకు ఫలాలు అందించేలా సంరక్షించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సీహెచ్‌పీ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటే విషయంలో ప్రతీ ఉద్యోగి సంస్థ చైర్మన్ బలరాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మొక్కలను సంరక్షించడంలో సీహెచ్‌పీ ఉద్యోగుల నిబద్ధత కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు కృష్ణమూర్తి, సీహెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య, జూనియర్ ఫారెస్టు అధికారి సుష్మ, పిట్ కార్యదర్శి రామయ్య తదితరులు పాల్గొన్నారు.


తీజ్ బుట్టలతో యువతులు

ముగిసిన తీజ్ సంబురం

లింగాపూర్: జాగో బంజారా.. బోరావ్ తీజ్ అంటూ శనివారం గిరిజనులు తీజ్ (మొలకల) పండుగను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈనెల 8 నుంచి తొమ్మిది రోజులపాటు కనుల పండువగా నిర్వహించారు. పెళ్లికాని యువతులు, మహిళలు జగదాంబ ఆలయంలో నైవేద్యాలు సమర్పించారు. గ్రామ నాయక్ ఇంటి దగ్గర పందిరిపై ఏర్పాటు చేసిన తీజ్ బుట్టలను కిందకు దించి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం చేశారు.


తీజ్ బుట్టల్లో డబ్బులు పెడుతున్న గ్రామపెద్దలు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


ఆసిఫాబాద్‌అర్బన్: శ్రీకృష్ణుడి ప్రతిమకు పూజలు చేస్తున్న భక్తులు


దహెగాం: ఉట్టి కొడుతున్న యువకులు

ఆసిఫాబాద్‌అర్బన్: శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు చూపించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. యాదవ సంఘం మండల అధ్యక్షుడు రవి, భక్తులు దీపక్‌రావు, సంతోష్, మల్లేష్, శ్రీనివాస్, వెంకటేశ్, భీమేష్, బలరాంనాయక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో..

కృష్ణాష్టమి వేడుకలను శనివా రం జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం ఆవరణలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో కార్యక్రమానికి హాజరయ్యారు. క్లబ్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షులు పాత శ్రీనివాస్, కార్యదర్శి కృష్ణమూర్తి, ఆ లయ కమిటీ అధ్యక్షులు శంకర్, లక్ష్మణమూర్తి, శ్రీనివాస్, వినేష్, రవి, శంకర్, వినోద్ పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మార్కెట్ ఏరియాలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన ఏడు జట్లు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి మన్నెవాడకు చెందిన యువకులు గెలుపొందగా, ద్వితీయ బహుమతి కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన యువత గెలుపొందారు. బహుమతులను ఎస్సై విక్రమ్ అందజేశారు.

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కాగజ్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు రాధా, గోపికలుగా వేషధారణ చేయించి తల్లులు మురిసిపోయారు. పట్టణంలోని ద్వారకానగర్, ఆదర్శనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని పల్లకి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం యాదవ సంఘ భవనంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆసిఫాబాద్‌రూరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఆలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని బూర్గుడ ఆలయంలో చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

కెరమెరి: శివాలయంలో శనివారం అత్యంత ఘనంగా గోకులాష్టమి జరుపుకున్నారు. మహిళలు దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. ఉదయం నుంచి సాయంకాలం వరకు మహిళలు ఆలయంలో పూజలు చేశారు.

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటాల శివాలయం, సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తలోడిలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కౌటాల ఉత్సవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సీఐ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఎస్సై విజయ్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు కుంచాల విజయ్, ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్య, భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అందవెల్లి, జీడిచేను, రాస్పెల్లి, కోసిని, శివపురం,భట్టుపల్లి తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం రాధాకృష్ణుల విగ్రహాలతో ఊరేగింపు చేపట్టారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఎర్రయ్య, బాలకృష్ణ, శంకర్, కిషన్, తిరుపతి, మహేశ్, గోపాల్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


కాగజ్‌నగర్‌రూరల్: వేషధారణలో చిన్నారులు


కాగజ్‌నగర్‌టౌన్: ఉట్టి కొడుతున్న చిన్నారులు


కెరమెరి: పూజలు నిర్వహిస్తున్న మహిళలు


కౌటాల: ఉట్టి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ


ఆసిఫాబాద్‌అర్బన్: వేషధారణలో చిన్నారులు

పీహెచ్‌సీ సందర్శన

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వరద నీరు రావడంతో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న ముగ్గురు బాలింతలను గుడిహత్నూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కిరణ్‌కుమార్, సిబ్బందితో మాట్లాడారు. భారీవర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు అందుబాటులో ఉండాలన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: ఇటీవల మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఇద్దరు బాధితులకు శనివారం పోలీసులు తిరిగి అప్పగించారు. మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన సెండె భీంరావు, వడ్డె మధు అనే వ్యక్తులు మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాధితులకు అప్పగించారు. ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే ఫిర్యాదు చేస్తే తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫోన్ ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీమ్‌ను అభినందించారు.